# వయసు బొమ్మ

ఆఫీస్ నుంచి బయటికొచ్చాను.

ఆబిడ్స్ సెంటరు చాలా రద్దీగా వుంది. సీతాకోక చిలుకల్లా అలంకరించుకొని వ్యాహ్యాళికి, షాపింగ్‌కి, సరదాలకి బయల్దేరిన యువతుల్తో రంగు రంగులుగా ఆకర్షణీయమై వుందా ప్రాంతం.

అకస్మాత్తుగా నా కళ్ళు ఎదురుగా వస్తున్న యువతి మీద నిల్చిపోయినయి.

అందంగానే వుందామె. కానీ అందం కన్నా ఆకర్షణ అమితంగా వుంది. బొడ్డు కింద చీర, సగం బయటికి కనబడుతున్న వక్షోజాలు, చీరకు-జాకెట్టుకు మధ్య నగ్నంగా కనబడుతున్న శరీరం...... వేడెక్కిపోతోంది......!

అమాంతం ఆమెని కావలించుకుని.....

అక్కడే నిలబడిపోయి ఆమె నన్ను దాటిపోయే వరకు అలాగా చూస్తుండి పోయాను.

చీర ఇంకొంచెం కిందకు జారితే ఎంత బావుంటుంది..... అడ్డంగా వున్న ఆ బెత్తుడు చీర కూడా తొలగిపోతే ఎంత రంజాగా వుంటుంది:?-----

ఆమె వేపే అలా చూట్టం అసహ్యం, అసభ్యత అని నాకూ తెలుసు-అయినా చూపులు పక్కకి మళ్ళించుకోలేక పోతున్నాను! నేనే కాదు అక్కడున్న చాలామంది అటువంటి పరిస్థితుల్లోనే కొట్టుమిట్టాడుతున్నారు!

ఆమె మాత్రం ఇవేమీ గమనిస్తున్నట్టు లేదు. ప్రజల్ని రెచ్చకొట్టడమే తన ధ్యేయం....అన్నట్లు వయ్యారంగా సోయగాలు ఒలకబోస్తూ నడుస్తోంది.

నాలో ఎంత అణగదొక్కాలని ప్రయత్నిస్తున్నా అదోవిధమైన ఆవేశం కట్టలు తెంచుకొని ముందుకురుకుతూ వుంది. ఆమెను చటుక్కున దగ్గరికి లాక్కోవాలని, ఏమేమో చేయాలని మనసు వువ్విళ్ళూరుతూనే వుంది. కానీ చుట్టూ జనం!

శరీరాన్నైతే బలవంతాన్నైనా అదుపులో పెట్టగలుగుతున్నాను గాని మనసుని పట్టుకోలేక పోతున్నాను.

'ఫాషన్లూ! జిందాబాద్! మీరు మరింత వేగంగా పురోగమించాలి అతి త్వరలోనే ఈ కొద్ది పాటి గుడ్డ కట్టుకోవడం కూడా సిగ్గు చేటనిపించేలా విజృంభించేసేయాలి. అప్పుడే నాలాంటి వాళ్ళకి మరింత కనువిందు!......'

ఆలోచిస్తూ నెమ్మదిగా బస్టాప్‌కి చేరుకోవడం, వెంటనే బస్సొచ్చేయడం జరిగింది. బస్సెక్కాను.

బస్సులోనే కాదు, బస్సు దిగింతర్వాతకూడా ఆమెవల్ల కల్గిన మత్తు పూర్తిగా తగ్గలేదు. మనసుని బలవంతాన నిగ్రహించుకొంటూ బయల్దేరాను.

మా ఇంటికెళ్ళే సందు తిరిగి రెండడుగులు వేసేనో లేదో ఠక్కున నిలబడిపోయాను!

రోడ్డుపక్కనే మురికిగుంట దగ్గర కూర్చునుందో అమ్మాయి. వయస్సు ఇరవై రెండేళ్ళకి మించి ఉండదు.

వయసుతోపాటు పెరిగిన అవయవాల్ని దాచుకోవాలనే ధ్యాస ఆమెకులేదు. వంటిమీదున్న ఆ కొద్దిపాటి చిరుగుల గుడ్డ ఆమె



నిండుయవ్వన శరీరాన్ని సరిగ్గా దాచలేక పోవడం చేత యవ్వనం తొంగి చూస్తోంది.

కానీ ఆమెకి ఆ ధ్యాసలేదు.....!

"బాబూ! ఒక్కపైసా ధర్మం చెయ్యండి!" అంటూ అతిదీనంగా వచ్చే పోయేవాళ్ళ నడుగుతోంది.

ఆమె బీదతనం. ఆకలి అరుపులు నన్ను కదిలించి వేసాయ్! ఆమెకి ఏదో ఒక సహాయం చేయాలన్న తపన, ఆమెని ఆ బాధల్నుండెవరైనా రక్షిస్తే బావుండునన్న జాలీ-నన్నావహించాయ్. ఆమె శరీరాన్ని పూర్తిగా దాచుకోవడాన్కి అవసరమైన వస్త్రాన్నన్నా లభించేట్లు ఛేయమని భగవంతుణ్ణి ప్రార్థించాను.

అబిడ్స్‌లో ఇందాక కనిపించిన ఆ ఫ్యాషన్ యువతి కళ్ళ ముందుమెదిలింది.

ఆమె, ఈ అడుక్కు తినే యువతీ- ఇద్దరూ యవ్వనంలో వున్నవాళ్ళే!దాదాపుగా వయస్సులు కూడా సమానమే!

మరి-

ఆమెను చూసి మనసలా ఎందుకు చలించింది? ఈమెవల్ల ఇలా ఎందుకు కరిగిపోతోంది?

వెంటనే స్ఫురించింది-

ఫ్యాషన్ కోసం చాలీచాలని వస్త్రాలు ధరించి అవయవ ప్రదర్శన చేస్తుందామె. ఈమె దారిద్ర్యం వల్ల స్తోమత లేక ఇలా అర్థ నగ్నంగా తిరుగుతోంది. అందుకే ఆమెను చూడగానే కడుపు నిండిన మరో ఆకలి. ఈమెను చూడగానే కడుపు తరుక్కు పోయి జాలీనూ!

అంతేకాకుండా మరో విషయం అప్పుడే తెలుసుకున్నాను. ఏ మనిషి మనసులో మంచి, చెడు ముద్రించుకు పోయివుండవు. పరిసరాల ప్రభావం వాళ్ళ మీదెంతో వుంటుంది;

"సంధ్యా......" గట్టిగా పిల్చాను ఇంట్లోకి అడుగుపెడ్తూనే.

"ఏంటండీ! వస్తూనే అలా కేకలువేస్తున్నారు!" శ్రీమతి ఆశ్చర్యంతో ఎదురొచ్చింది.

"నీ పాత చీర వుంటే ఒకటివ్వు....."

శ్రీమతి ఎగాదిగా నన్నోసారి చూస్తూ ఏం మాట్లాడకుండా లోపలికెళ్ళి ఓ పాత చీర తెచ్చిచ్చింది.

ఆ చీరని యాంత్రికంగా అందుకుని గబా ఆ అడుక్కునే యువతివైపు బయల్దేరాను. *

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక 20-4-1978)